# హక్కు

మాలపేటంతా మాసందడిగా వున్నాది.

సిన్న సేజి కట్టినారు. సిన్న పందిరేసినారు. మయికులు ఎట్టినారు. సేజిమీన దొరలెవలో కూకుడున్నారు. ఆ వెనకాతల కరణంగోడు నక్కానానిసుంటాడు. ఆడు నేకుండా ఎక్కడా ఏటీ జరిగదు మరి. కిందిన కుర్సీల మీన మునిసీపాలుబాబు, పెసిడెంటుబాబు, బాగా వున్నోళ్ళు, పెద్దలు కూకుడున్నారు. మాలజనంమటుకు నేలనే కూకుడున్నారు.

కూకుడున్న దొరబాబులు నెగిసి మయికాడకొచ్చి ఏటేటో సెప్పేరు. ఆలేటి సెబుతున్నారో ఈ మాలనాకొడుకులికి అరదం కానేదు. అరదం కాకపోయినా నోరెళ్ళబెట్టి ఇన్నారు. మద్దె మద్దెన కరణంగోడు సప్పట్లు సత్తే ఈళ్ళు సరిసేవోళ్ళు. అది ఆ బాబిచ్చిన టెయినింగే ముందుగా.

స్టేజిమీన ఇలా కొంత బాగోతవయ్యాక ఒక కురిసీలోనుంచి బానాకట్టంగా ఓ దొరబాబు లేసినాడు. ఆ బాబు నెగడానికే అంత కష్టం పడ్డం ఆ బాబు మెళ్ళోనున్న బోలుడు దండల బరువ్వల్లకాదు. ఆ బాబే బలుపు. దిబ్బడు. దిబ్బతలకాయమీన సిన్న కొంగిరేసు టోపి. గంగడోల్లాగున్న మెడకాయ. సాకలబానలాగున్న బొజ్జ.... ఆ నల్లదొరని ఆ మాలోళ్ళంతా అంతగా గురుతు పట్టనేకపోనారు. ఆ మద్దెన ఓటడగడాని కొచ్చినాడని ఆ బాబే ఆళ్ళకి గురుతుజేసినాడు. అంతేగాదు 'నానూ మాలోణ్ణే' అని చెప్పేడు. అలా సెప్పగానే మాలోళ్ళంతా సప్పట్లు దబదబా కొట్టినారు. ఈళ్ళే ఆ దొరబాబంత అయిపోయినట్టు సంబరపడిపోనారు. ఆ బాబు మంతిరంట. మనోడు. మాలోడు మంతిరయినాడు. మరి మన కష్టా

లింక గట్టెక్కినట్టే నెక్క అనుకుంటే ఆ నెక్క తప్పన్నమాట. ఏ మతవోడయినా, ఏ కులవోడయినా వున్నోళ్ళంతా వొకటే జాతని ఆళ్ళకి తెల్దు. తెలక ఆ మంతిరి బాబు తమ జాతని మురిసిపోతున్నారు మాల జాతి.

ఉప్పుడా మంతిరిగోరు మాలపేటోళ్ళందరికి ఇళ్ళపట్టా లిస్తున్నారు. ఒక్కొక్కడి పేరు కరణంగోడు పిలుస్తున్నాడు. మాలోళ్ళు బయ్యెంతో కదిలి, బయ్యెంతో స్టేజి ఎక్కి, బెదురు సూపుల్తో సేతులు జాస్తున్నారు. మంతిరిగోరు పెసాదం పంచుతున్నట్టు పట్టాలు సాపిన సేతుల్లో ఎట్టి దండం ఎడతున్నాడు - నవ్వు మొహంతో. మాల మొకాలు మటుకు ఆ బాబు దండం ఎడుతుంటే గొడ్డుల్లా బెదిరిపోతున్నాయి. పట్టాలిస్తున్నోడి మొకంలో నున్న ఆనందపు నవ్వు పట్టాలు తీసుకుంటున్నోళ్ళమొకాల్లో కానరాటంనేదు. గమ్మత్తద్దేమరి !

మంతిరిగోరు పట్టాలిస్తున్నట్టు పొటోలు తీయించుకోడంతో అక్కడ తంతు ముగిసినాది.

పెబుత్వం అన్నాక పెతివోడికి తిండి, బట్ట, గూడు ఇవ్వాల. ఆ చంగతి ఆళ్ళకి తెల్దు. ఉప్పుడిచ్చిన పట్టాలు ఆ మూడు ఇయ్యవు. గూడు కట్టుకోడానికి స్తలంమటుకు ఇస్తాంది.

కొన్ని దిక్కులయితే ఇళ్ళే కట్టిచ్చినారు-వూరికి దూరంగా, గవర్మెంటోడే వూళ్ళకి దూరంగా ఇళ్ళుకట్టి మాలోళ్ని అంటరానోడిగా జూత్తే, పెద్దకులవోళ్ళు అలా సూడ్రామరి. సరే; మాలోళ్ళకి ఇళ్లుకట్టేవన్నారు. అవిళ్ళేనా? ఉప్పుడు ఎక్కడైనా ఒక్క కొంపైనా వున్నాదా? గాలొత్తే పెంకు లెగిరిపోయి, గట్టిగ వానొత్తే ఇళ్ళేకొట్టుకుపోయి.... అవట్టండిఇళ్లు.

అందుసేత ఉప్పుడు ఇళ్ళయితే కొట్టుకుపోతున్నాయనేసి, ఇళ్ళ స్థలాలయితే కొట్టుకు పోవనేసి ఇళ్ళ స్తలాలిస్తున్నారు గావాల.

పట్టాలిచ్చేయగానే కత అయిపోదు. కతంతా ఆ యెనకే. మాలోళ్ళ కుక్క పాట్లు పట్టాలందుకున్నాకే.

ఆ మాలపేటలో పెతికుటమానానికి ఒక పట్టా ఇస్తే, బారికోడు కుటమానానికి మటుకు ఆరుపట్టాలు. అదిమటుకు కరణంగోడి మాయని

మాలోళ్ళకి ఎర్రకే. ఏపంటే బారికోడు కుటమానవంతా ఆడికాడ వుండి ఆడికాడే పనిసేత్తున్నాడు.

ఒకపట్టా ఇలుప అయిదు సెంట్ల భూమి. అందరికీ అయిదేసి సెంట్లయితే బారికోడికి మటుకు ముప్ఫయిసెంట్లు. ఇదీ న్యాయం!

స్తలాలు అందరికీ ఒక్కాడే ఇచ్చినార్రు మాలోళ్ళని, మాదిగోళ్ళని కలగాపులగంగా కలిపేసినందుకు ఆల్లోనాళ్ళ గొడవలు పడ్డారు. "మాదిగోళ్ళని మాపక్కలోడేస్తే మా పరువేవవాల! రేపొద్దున్న ఒవులైనా పెళ్ళాలొత్తే ఎలా తిరిగెత్తుకోవాలా?" అని గింజుకున్నారు మాలోళ్ళు అన్నేమేనా, ఎర్రిమాలోకంగా.

అయితే అంతకన్నా పెద్దకుంబకోనం జరిగిపోవడంతో ఆల్లోనాళ్ళ గొడవాడు కోడం ఆపేసినారు.

కుంబకోనం ఏటంటే స్తలాలు ఇచ్చినకాడ పదమూడు మామిడి సెట్లున్నాయి. ఆ సెట్లు ఒవురికి సెందాల?

కరణం సెప్పిన పెకారంగా ఏ టంటే ఆ సెట్లన్నీ బారికోడికే సెందుతాయట. నెందుసేతంటే ఆ సెట్లన్నీ బారికోడికిచ్చిన స్తలాల్లో వున్నాయి గనకట.

మాల, మాదిగలంతా పందుకు ఒప్పుకోనేదు.

మాఅందరికీ ఒక్కొక్క పట్టా అయితే బారికోడికి ఆరుపట్టాలేటి? ఆడి ఆరు స్తలాలు ఎక్కడ మామిడి సెట్లుంటే అక్కడుండడవేటి? ఇదంతా మాయగాకపోతే.

"ఇందులో మాయేటినేదర్రా సన్నాసుల్లారా. అ దాడి అదురిస్టె వంతే. నాట్రీ టికెట్టు అందరూ కొంటారు గాని నాట్రీ పేలేదీ ఒకిడికే గదేటి. అలాగే ఇదీని." అన్నాడు కరణంబాబు.

'నాట్రీ అయితే ఒక్కాడ పేల్తదిగాని ఆరుదిక్కాల ఒక్కడికే పేలదు. ఇదిగో కరణంబాబు. మా వంత ఎర్రోళ్ళంగాదు."

"అయితే ఉప్పుడేటంటారర్రా"

"ఏటీనేదు, ఆ సెట్లు అందరికీ దక్కాల. ఆటిమీదొచ్చే ఫలసాయవంతా అంతా పంచుకోవాల."

"అమ్మనాకొడుకుల్లారా! ఎంతాశరా!" అని గెంతినాడు కరణం బాబు. "ఆ సెట్లు కాదు. ఆటికి కాసిన కాయల్లో ఒక్క కాయకూడా మీకు రాదు. అంతా బారికోడిది. పొండిక." అని కేకలేసినాడు.

"ఈ అన్నేయమేటో. ఆ ఫలసాయమెందుకు దక్కదో సూస్తాం సూస్తాం" అనుకుంటూ పోయేరు మాల మాదిగలు.

ఆ రేతిరి ఒవ్వులూ తొంగోనేదు. అంతా ఒక్కాడ కూకొని పట్టాలు తెచ్చిన తంటా మీద ఏటి సేయాలా అని ఆలోసించినారు.

ఆళ్ళకి పట్టాల్లోనుంచి వచ్చిన అయిదు సెంట్ల భూమీ కొపడ్డంనేదు. ఆ పదమూడు మామిడిసెట్లే ఆళకిప్పుడు కాపడుతున్నాయి. ఆ ఫలసాయాన్ని ఎలా పొందాలని ఆలోసన.

'ఏటిసేయాల' అనేదానికి తలొకరు తలోమాట అన్నారు. సివరికి కుర్రోళ్ళదో మాట, ముసిలోళ్ళదోమాట అయింది.

ముసిలోళ్లు అనేదేటిదంటే దుడుసుతనం పని సేయదన్నారు. 'పట్టాలిచ్చిన మంతిరిగోరికి కాగితం రాసి ఎడదాం' అన్నారు. ఆ బాబుకే కాదు. తాచీల్దారుకి, కలకటేరుకి కూడా కాగితాలు ఎడదాం అన్నారు. ఈలోగా మనూరి పెద్దల్ని నేయం సెప్పమంటాం అన్నారు. కుర్రోళ్లు మటుకు ఈటన్నిటివొల్ల పని అవ్వదన్నారు. కాగితాలతో అయిన అనుబవాన్ని గ్నేపకం సేసారు. కొండదిగువనున్న బంజరుభూవికి పట్టాలిప్పించమని ఎన్నాళ్ళుగానో కాగితాలు ఎట్టినారు. నంచాలు తినిపించినారు. ఒవ్వునికి? ఒవ్వులుకో కాదు. ఈ కరణం బాబుకే. ఇంట్లో అగ్గేసుకోవడం మానేసి మరి తలొకలు పదేసి నంచం ఇచ్చినారు. కలకటేరుకాడకి, తాచీల్దారు కాడకి కాళ్ళు అరిగేలా తిరిగినారు. నాభంనేకపోయింది. సిట్టసివరకి సాగుకి తెచ్చుకున్న బంజరుభూవిని ఒవ్వుడో మిలటరీవోడంట - ఆడికి దానం సేసిన్నారు. అదలాగుపోనాది. ఉప్పుడూ ముసిలోళ్ళన్నట్టు ఆళ్ళమీన నమ్మకం ఎట్టుకుంటే ఇలాగే బెడిసికొట్టద్ది అన్నారు కుర్రోళ్లు. అయితే 'ఏటిసేద్దామంటారు?' అన్నారు కోపంగా ముసిలోళ్ళు. 'ఏటుంది? సెట్లుని సొదీనం సేసుకోవడవే. ఒవ్వుల్ని ఆ సెట్లుని ముట్టుకోకుండా సుట్టూ ముళ్ళకంచె ఏసీడవే." అన్నారు కుర్రోళ్లు. సివరికి ఒకలా రాజీకొచ్చి

నారు. మునసోబు సేసే పెయిత్నాలకి నెలరోజులు పెయిను. వప్పటికీ ఏటీ తేలకపోతే కుర్రోళ్ళు సెప్పినమాటే ఇనాలి.

అంతా అలాగే అంటే అలాగే అన్నారు.

మాలపెద్దలు ముగ్గురుకలిసి మునిసీబుకాడికి, పెసిడెంటుకాడికి ఎల్లినారు. ఆళ్ళు గొడవంతా ఇని 'ఇదంతా కరణంగోడి పితలాటకవేఁ' అన్నారు. కరణంగోడిమీదకి మాలోళ్ళని వుసిగొల్పినారు ఆళ్ళిద్దరూ. ఎందుకంటే ఈమద్దెన కరణంగోడికి, ఈళ్ళిద్దరికీ పడ్డంనేదు. మాయలూ, మోసాలు సేసి డబ్బుసంపాయించడంలో కరణం ఈమద్దెన ఈళ్ళని మించిపోతున్నాడు. కరణం ఈమద్దెనే ముప్పయివేలెట్టి ఇంజనీరల్లుడిని కొన్నాడు. కొడుకుని బసీలో డాకటేరు సదివిత్తన్నాడు. వొడ్డీలుకిస్తూ, దొంగకాగితాలురాస్తూ రయితుల భూవుఁలు ఒడేసుకొని నక్షాదికారై పోతున్నాడు. కరణంబాబు అలా పెరిగిపోవడం అబాబు లిద్దరికీ సయించ లేనంతపని. అంసేత మాలోళ్ళని వుసిగొల్పినారు. 'సెట్లు అందరికీ సెందాల. ఒవుడిబాబుగోరిసొమ్ము—బారికోడు వడేసుకోడానికి? బారి కోడికో పట్టా ఇచ్చి, ఆడి జగిలిగోడికో పట్టా ఇచ్చి, ఆడికొడిక్కో పట్టాఇచ్చి....అలా ఇంట్లోవోళ్ళందర్కీ పట్టాలు. ఆళ్ళకిచ్చిన పట్టాల్లోనే మావిఁడిసెట్లు. మా బాగుందయ్యా అన్నారు. 'మరేటి బయ్యంనేదు. కలక టేరుకి, తాసీల్దారుకి కాగితాలెడదాం. నాను సొయాన తాసీల్దారుతో మాటాడ తాను' అన్నాడు పెసిడెంటు. 'ఈలోగ ఆ సెట్లమీన కాకినికూడా వాల్నీయ కండి. ఇదేటో తేలేవరకు, కరణంగాడి ఎత్తులేటోసూద్దాం' అన్నాడు మునిసేబు.

మాల పెద్దలు దండాలెట్టి బయలెల్లినారు. ఆళ్ళకి వచ్చినపని అయిపోయి నట్టనిపించింది. ఇక మావిఁడిసెట్లు తమవే అనిపించేసినాది.

మాలపెద్దలు సేసుకొచ్చిన గొప్పపని అందరికీ గొప్పగా అని పించేదేవోఁగాని కుర్రోళ్ళకి ఏటీ అనిపించనేదు. 'అవ్వేటీ జరగని పనులు' అని కొట్టిపారేసినారు.

కుర్రోలన్నట్టుగానే నెల్రోజులయినా ఏటి పరితం కాపడనేదు. ఎక్కడేసిన గొంగళి అక్కడే వుంది. మాల పెద్దలు మాటమాటకీ

పెసిడెంటు, మునిసేబుకాడికి పెళ్తుంటే ఏటి బంకలా బట్టుకోని వొగ్గరేటి? పనులేటి అంత తేలిగ్గా అయిపోతాయేటి? ఇదేం సిన్న యవ్వారంకాదు. అయినా మా కిదే పనా?" అన్నారు సిరాగ్గా. ఆళ్ళ సిర్రు బుర్రులు సూసి మాలపెద్దలడుగు ఎనక్కేసారు.

కాని కుర్రోళ్లు అడుగుముందు కేసారు. ఎప్పుడో నెమ్మదిగా పనులవుతాయంటే ఆళ్ళకి నమ్మకంనేదు. కుర్రోళ్ళంతా లేసారు. ఏటి సేయాలో ముందుగానే నిర్ణయం సేసేసుకున్నారు.

కుర్రోళ్ళంతా ఎళ్ళి మామిడిసెట్లుసుట్టూ ముళ్ళకంచె వేస్తుంటే బారికోడు కుటమానవంతా అక్కడికి పారొచ్చింది. బారికోడు కుటమానంలో అయిదుగురు మగోళ్లు వస్తాదుల్లాటోళ్ళు వున్నారు. ఆళ్ళందరికి పట్టాలున్నాయి. "మా సెట్లు ముట్టుకోడానికి మీరెవుర్రా నంజికొడుకుల్లారా" అని కర్ర లెత్తారు. ఆ కుర్రోళ్లుగూడా అందుకు రడీగానే వున్నారు. గట్టిగా కొట్టుకున్నారు. అంతావచ్చి కలుగజేసుకొని ఇడిపించినారు. అప్పటికే బుర్రలు బద్దలయినాయి. బారికోడి కొడిక్కీ, జగిలోడికి, ఆతల ఇద్దరు కుర్రోళ్ళకీ నెల్రోజులు మంచం దిగలేనంత దెబ్బలు తగిలినాయి.

* * *

మామిడి సెట్లుకోసం ఆళ్ళు, ఈళ్ళు దెబ్బలాడుకుంటుండగా ఆ దెబ్బలాటతో తనకేటి పనన్నట్టు సెట్లు గొప్ప కాపు కాసేసినాయ్.

గొడవ తేలకపోడంసేత ఆతల బారికోడు కుటమానం, ఈతల మాలపేట కుర్రోళ్ళు సెట్లకి కాపలా ఒవులుకాళ్ళే కాస్తున్నారు. ఈసారి పెద్దసిగపాతవేఁ అయ్యేలాగుంది - సూత్తుంటే.

* * * *

"ఒరే రావుఁలూ"- కరణంబాబు కేకది. 'అయ్యా' పారొచ్చినాడు బారిక రావుఁలు. "సెట్లన్ని బాగా కాపు కాసినాయిగదరా:"

"ఏ సెట్లండి?"

"ఇంకేం సెట్లురా ఎదవ. మావిఁడి సెట్లురా. మీ పట్టాల స్థలాల్లోని సెట్లు. శాన ఇవరాలు." నవ్వినాడు కరణంబాబు.

"అయ్యెంటే? నాగనే కాస్తొచ్చినాయండి."

"ఇప్పుడు మీవాళ్ళ పనులు గొడవకి రాదంనేదుగదా."

"నేననే అనుకుంటున్నానండి."

"అయితే ఇంకనేం. రేపు పడిపుండి కూలీర్ని ఒట్టుకెళ్ళి కాయంతా కోయించి ఇంటికెత్తించు."

"ఎక్కడికండి?"

"నారెకూప. మతిగాని పోనాదేట్రా. ఎక్కడికేటి? ఇక్కడికే. మాయింటికే."

"మీ ఇంటికెందుకండి?"

"ఎందుకేట్రా మద్ది ఎధవా. నీకు ఆరు పట్టాలు రాయింపించింది. ఎందుకనుకుంటున్నావ్రా."

"ఎందుకనుకుంతావండి. మా పట్టాలు మా కోసవేఁ అనుకుంతానండి. దయతో మీరన్ని పట్టాలు ఇప్పించినందుకు దండాలండి."

కరణంకి సిర్రెత్తుకొచ్చినాది.

"నారె.... నారె.... నారికెధవా. నే నన్ని పట్టాలు నీ కుటమానం పేర రాయించింది, నీమేద పేంవ కాత్తిపోయి కాదొరె. నెట్టున్న నలాతే మీకు పేయించింది నీవెట్టిన వొట్టి దండాలతోనే పూరికుండిపోడాని కాదురె."

"మరెటికి ఏటంతారండి."

అమ్మ ఏటీ బుర్ర తిరుగుడు? అనుకుండు కరణంగారు.

"ఏటంతన్నానంటే నీవు నోర్ మూయ్యమంతున్నాను. నోరు మూసుకొని రేపు అన్ని సెట్లకాయ దింపించమంతున్నాను. నీవో బుట్టడు కాయ పెట్టుకొని మిగతాదంతా ఇంటిమీన తోలేయ్. ఏటి?"

"అదేటండి అన్నేయం సెలవిత్తారు. మీరు అన్నేయాలు అందరికీ సేయిడ మిన్నాట్లా నాను సూత్తున్నాను. మీరు సేయిత్తున్న అన్నేయాలు ఎక్కడ మనసుకుండా సేత్తున్నాను నాను. మీకోసం మా మాలోళ్ళందరికీ ఇరోదిగై ఒంటిపిల్లి రాకాసినాగ వుంతన్నాను. ఉప్పుడు నాకే అన్నేయం

సేయడానికి సేమె తినారన్నమాట. నాకు మాబాగా బుద్ధి సెప్పినారండి నా సెట్లమీన మీ కన్నెందుకు పడిందండి? మీకేటి లోటు? ఇంకా పూట గడవని మా జాతోళ్ళు మా సెట్లంటూ పోట్లాటకొచ్చినారంటే అరద వుంది. మీకిదేం కక్కుర్తండి. కావలిత్తే మీరు పట్టాలిప్పిచ్చిన సాయానికి నానే ఓ బుట్టెడు కాయలు మీకు అంపిత్తాను. తీసుకోండి."

"అమ్మ. దొంగనంజికొడకా.... నన్నంతేసిమాట అంటావురా. సూద్రా, నిన్నేటి సేత్తానో, నాను తెల్సుకోవాలేగాని నీకు ఒక్క పట్టా కూడా దక్కకుండా సేసేత్తాను. ఒక్క కాయ కూడా రాకుండా సేసేత్తాను.'

"మీరంతవోళ్ళని నాకు తెల్దేటండి."

'తెల్సుకదా. అంసేత నోరు మూసుకొని నాను సెప్పినట్టు సేయి. అరదవయిందా?

"అలాగే సేత్తానండి. సెట్టుకి ఏదొందలునెక్కన సొమ్మియ్యండి"

"ఆహా! అంతవరకూవచ్చినావన్నమాట. ఫలశాయమంతా మీమాలోళ్ళకి సెందేటట్టు సేసియగల్ను, జేగరత - నాగ్గాని తిక్కరేగినాదంటే"

"మంచిదేనండి. అలాగే సేయండి. ఏ గొడవా వుండదు. ఏది సేసినా ఆళ్ళు తీసుకోగల్రుగాని మీరు తీసుకోలేరు గదండి. ఆటిమీన మీకు అక్కు నేదు గదండి."

"అమ్మనాకొడకా. నాకు అక్కు సెందకునేదో సూద్దువుగాని. రేపి పాటికి నేనే సొయాన వచ్చి కాయంతా దింపించకపోతే సూడు."

"అలాగే సూత్తాను రండి" అని సరసరా ఎల్లిపోనాడు జారిక రావులు.

జారిక రావులు తనెవరో తెల్సుకున్నాడు. తన జాతోళ్ళకి దూరం వెఁపోయి సాధించినదేటో తెల్సుకున్నాడు. తన జాతేటో, కరణపోడి జాతేటో తెల్సుకున్నాడు. తన జాత్తో సేతులు కలపడానికి నిర్ణయించుకున్నాడు - ఏదేమైనా కరణపోడికి గట్టిదెబ్బ తీయాలనుకున్నాడు.

జారిక రావులు తన కుటమాసంతో సాలాసేపు ఆలోచించి ఆ రేతిరే మాలపేటకి బయల్దెల్లినాడు.

అన్నట్టుగానే కరణంబాబు మర్నాడు పొద్దునే పాతికమందితో దిగినాడు. తను కావలుకుంటా అక్కడే వుండి పదమూడు సెట్లకాయి దింపించినాడు. కాయంతా దించి ఒక్కచోటికి చేర్చేటప్పటికి మధ్యాన్నం అయిపోనాది. నారిక రావులు అక్కడే వున్నాడుగాని ఏమీ అనకపోవడంతో కరణం ఆశ్చర్యపోనాడు. అయినా ఎందుకో గుండె దడగానే వున్నాది.

కాయంతా దింపేయడం అయిపోగానే వొక్కసారిగా కారు మబ్బులు కమ్ముకొచ్చేసినట్టు కరణంసుట్టూ మాలపేటజనం కమ్మేసినారు.

కరణంబాబు తెల్లబోనాడు, అదిరిపోనాడు, బెదిరిపోనాడు.

అందరి సేతుల్లోనూ కర్రలూ, కటార్లు వున్నాయి. అందరి కళ్ళు ఎర్రెర్రగా వుండి, అగ్గిని కక్కుతున్నాయి.

కరణంబాబు వొణికిపోతుండు. తను తెచ్చిన పాతికమంది కూలీలు ఆళ్ళకాదెంత?

“పడ్డ కష్టం సాలుగాని, మరిక కాయలు కదపటానికీల్లేదు” - మాలపేటోళ్ళు.

“కాయరిక ముట్టుకోడాని కొల్ల కాదు” - నారిక రావులు.

“బట్టడు కాయలు నానే ఇట్టున్నాను ఒట్టుకుపో - ఏదో సాయం సేసానన్నావు గదేటి” అని నారిక రావులు అనడంతో కరణపోడికి ఒళ్ళమండి రావులు మూతిమీద గట్టిగా కొట్టేడు - గొడుగు కర్రతో.

రావులు నోట్లోంచి రగతం బలబలమని కారినాది. కిందపడి పోనాడు.

దాంతో మాలపేట కుర్రోళ్ళు, నారికోడి బంధువులు, కరణంగోడి మీన పడి పులికేసినారు. అదిసూసి కరణంతోటి వొచ్చిన కూలీలు పారి పోనారు. కాయలు తోలుకెళ్ళడానికొచ్చిన ఎడ్లబండిమీన ముక్కలిరిగి పోయిన కరణంబాబుని ఒడేసి ఆడింటికే తోలేసినారు.

ఇప్పుడిక పలసాయం అందరిదీను.